సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
సోమవారం । 19 । ఫిబ్రవరి । 2024



నేటి నుంచి 'అమృతోత్సవం'

విశాఖలోని శ్రీలలిత పీఠంలో సోమవారం నుంచి అమృతోత్సవం పేరిట విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 8లో



ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు

విశాఖ : సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో రాధాకృష్ణులు, సుభద్ర విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో అలంకరించారు.



శ్రీవారి సన్నిధిలో పారాయణ

విశాఖ: రుషికొండలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం శ్రీవారి సేవకులు శ్రీ విష్ణు సహస్రనామ పారాయణ చేశారు.

పింఛనే ఆసరా

ప్రభుత్వం ప్రతీ నెలా క్రమం తప్పకుండా అందిస్తున్న పింఛను సొమ్ము వేలాది కుటుంబాలకు జీవనాధారమైంది. వైకల్యం.. వృద్ధాప్యం కారణంగా కదల్లేని స్థితిలో ఉన్న వారికి ఆసరాగా మారింది. నెల ప్రారంభమైన రోజే వేకువజామున వలంటీర్లు నేరుగా ఇంటికి తీసుకొచ్చి నగదు అందిస్తుండటం వారికి ఎంతో భరోసా ఇస్తోంది.

- వేలాది కుటుంబాలకు ఆధారం
- దివ్యాంగులు, వృద్ధులకు బాసట
- ఇంటి వద్దే అందజేస్తున్న వలంటీర్లు
- అభాగ్యులకు అండగా ప్రభుత్వ సేవలు



అనంతగిరి: గత ప్రభుత్వంలో పింఛను కోసం వేసి ఉన్న లబ్ధిదారులు



నేడు లబ్ధిదారు ఇంటికి వెళ్లి పింఛను ఇస్తున్న చీడివలస వలంటీరు అప్పలస్వామి

అనంతగిరి : ప్రతీ నెలా ప్రభుత్వం చెల్లిస్తున్న సామాజిక పింఛన్లు వేలాది కుటుంబాలకు ఆర్థిక ఆసరాగా నిలుస్తున్నాయి. వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు వీటిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. గత ప్రభుత్వంలో ప్రతినెలా 15వ తేదీ వరకు పింఛను సొమ్ముకోసం పడిగాపులు కాయాల్సి వచ్చేది. ఎంతో వ్యయ ప్రయాసలకు గురై మండల కేంద్రానికి రోజుల తరబడి తిరిగేవారు. జన్మభూమి కమిటీలు చేతివాటం ప్రదర్శించేవారు. పింఛను మంజూరు కావాలన్నా వారిచుట్టూ తిరగాల్సి వచ్చేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టాక వారికి అవస్థలు తప్పాయి. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వారి ఇబ్బందులను గుర్తించారు. పరిష్కారంపై దృష్టి సారించారు. గ్రామ వలంటీర్లు ప్రతినెలా వారి ఇళ్లకు వెళ్లి ఒకటి, రెండు తేదీల్లో పింఛను మొత్తం అందజేసేలా చర్యలు చేపట్టారు. పార్టీలు, రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వం పింఛను మంజూరు చేస్తోంది.

ప్రతినెలా రూ. 39.17 కోట్లు..

జిల్లాలోని 22 మండలాల్లో 1,29,285 మంది వివిధ రకాల పింఛన్లు పొందుతున్నారు. కొయ్యూరు మండలంలో 7883, గూడెంకొత్తవీధిలో 7931, రంపచోడవరంలో 4710, అరకువేలిలో 6683, దేవీపట్నంలో 4525, గంగవరంలో 4056, కూనవరంలో 4043, హుకుంపేటలో 7395, డుంబ్రిగుడలో 6646, వీఆర్‌పురంలో 3805, వై.రామవరంలో 3446, ముంచంగిపుట్టులో 6463, చింతపల్లిలో 9728, రాజవొమ్మంగిలో 6683, ఎటపాకలో 6271, అనంతగిరిలో 6251, అడ్డతీగలలో 5626, మారేడుమిల్లిలో 2061, పెదబయలులో 6320, పాడేరులో 6800, చింతూరులో 5207, జి.మాడుగుల మండలంలో 6752 మందికి లబ్ధి చేకూరుతోంది. వీరికి గాను ప్రభుత్వం ప్రతినెలా రూ.39.17 కోట్లు వెచ్చిస్తోంది.

ఇద్దరి నగదుతో పోషణ



చిన్నప్పుడే తండ్రి అనారోగ్యంతో చనిపోయాడు. మా తల్లి మంగమ్మకు నేనే ఆధారం. ఐదేళ్ల క్రితం ఉపాధి నిమిత్తం గుజరాత్ వెళ్లాను. సిమెంట్ ఫ్యాక్టరీలో పనిచేస్తుండగా ప్రమాదశాత్తూ కుడిచేయి విరిగిపోయింది. తరువాత సొంతూరు వచ్చేశా. జీవనోపాధి లేక ఇబ్బందులు పడ్డాను. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత దరఖాస్తు చేశా. వెంటనే పింఛను మంజూరైంది. తల్లికి వితంతు పింఛను అందుతోంది. రూ.మూడు వేల చొప్పున ఇద్దరికి అందుతున్న రూ.6 వేలతో జీవనం సాగిస్తున్నాం.

– పోయి రామారావు, దివ్యాంగుడు, గుమ్మకోట, అనంతగిరి మండలం

రూ.3 వేలు ఆధారం



పుట్టుతోనే దివ్యాంగుడిని కావడంతో చాలా ఇబ్బందులు పడ్డా.తల్లి చిన్నప్పుడే చనిపోయింది. తండ్రి, నేను ప్రభుత్వం ఇచ్చే పింఛనుపై ఆధారపడి జీవిస్తున్నాం. గతంలో పింఛన్‌కోసం లంగుపర్తి పంచాయతీ కేంద్రానికి రావాల్సిన పరిస్థితి ఉండేది. తండ్రి బాలన్న ఎత్తుకుని గుట్టలు దాటుకుని సుమారు ఎనిమిది కిలోమీటర్ల దూరం మోసుకుని వెళ్లేవాడు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇంటి వద్దకు తీసుకువచ్చి ఇస్తుండటంతో ఇబ్బందులు పడ్డాయి. జీవనానికి ఎంతో ఉపయోగపడుతోంది.

– పుట్టబోయిన అప్పన్న, దివ్యాంగుడు, చీడివలస, అనంతగిరి మండలం

వృద్ధాప్యంలో ఆదుకుంది



నా వయసు సుమారు 85 సంవత్సరాలు. చూపు సరిగ్గా కనిపించదు. భర్త చనిపోవడంతో పోషించే దిక్కు కరువైంది. కాళ్లు చేతులు కూడా పనిచేయడం లేదు. మంచం మీద ఉండాల్సిన పరిస్థితి. చుట్టుపక్కల వారు సాయపడుతుంటారు. పోషణ భారంగా మారింది. ప్రభుత్వం అందించే పింఛను సొమ్ము జీవనాధారమైంది. ప్రతినెలా వలంటీర్ ఇంటికి వచ్చి పింఛను సొమ్ము ఇస్తున్నాడు. ఆ మొత్తంలో కొంత నగదును నిత్యావసర వస్తువులకు ఉపయోగిస్తున్నాను. సంతకు వెళ్లేవారికి నగదు ఇస్తే తీసుకువస్తున్నారు.

– వంతాల బంగారి, కల్యాణగుమ్మి, అనంతగిరి మండలం

కొంత దాచుకుంటున్నా



గత ప్రభుత్వంలో పింఛను నిలిచిపోయింది. రెక్కాడితేనే గాని డొక్కాడని పరిస్థితి. వృద్ధాప్యం కావడంతో కూలి పనికి వెళ్లే అవకాశం లేదు. జగనన్న ప్రభుత్వంలో దరఖాస్తు చేసుకుంటే వెంటనే మంజూరైంది. ప్రభుత్వం ఇచ్చే పింఛను సొమ్మే జీవనానికి ప్రధాన ఆధారం. ప్రతినెలా గ్రామ వలంటీర్ మాణిక్యం పింఛను సొమ్మును క్రమం తప్పకుండా తీసుకువచ్చి ఇస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చే మొత్తంలో కొంత నగదును పోషణకు ఉపయోగిస్తున్నాను. మిగతా మొత్తం అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగపడుతోంది.

– సిరగం కమల, పెద్దూరు, అనంతగిరి మండలం

న్యూస్‌రీల్

చాపరాయిలో సందడి



తరలివచ్చిన పర్యాటకులు

డుంబ్రిగుడ: ప్రముఖ పర్యాటక కేంద్రం చాపరాయి జలపాతం వద్ద పర్యాటకులు సందడి చేశారు. ఆదివారం మైదాన ప్రాంతం నుంచి కుటుంబ సమేతంగా భారీగా తరలి వచ్చారు. జలపాతంలో స్నానాలు చేస్తూ సందడి చేశారు.

పర్యాటక ప్రాంతాలు కిటకిట



జలతరంగణి జలపాతం వద్ద పర్యాటకులు

మారేడుమిల్లి : మండలంలోని పర్యాటక ప్రాంతాలన్నీ కిటకిటలాడాయి. ఆదివారం సెలవు కావడంతో దూర ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చారు. జలతరంగణి, అమృతధార, దుంపవలస జలపాతాలు, వాలీసుగ్రీవ్ వన మూలికల సంరక్షణ ప్రదేశం, జంగిల్ స్టార్, పాములేరు, గుడిస హిల్ టాప్, వ్యూ పాయింట్ల వద్ద సందడి నెలకొంది.

బొర్రా గుహలు వెలవెల



నిర్మానుష్యంగా బొర్రా గుహలు

అనంతగిరి: మండలంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాలకు సందర్శకులు రాకపోవడంతో వెలవెలబోయాయి. గత మూడు వారాలు అంతంతమాత్రంగా పర్యాటకులు రాగా.. ఈ వారం పూర్తిగా సందర్శిత ప్రాంతాలు కళ తప్పాయి. బొర్రా గుహల వద్ద సందడి కరువైంది.

మోదకొండమ్మకు భక్తుల నీరాజనం

- ఇంటి పండగలతో సందడి



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

సాక్షి, పాడేరు: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం పాడేరులోని మోదకొండమ్మతల్లిని దర్శించుకునేందుకు ఆదివారం భారీగా భక్తులు తరలివచ్చారు. ఇంటి పండగల్లో భాగంగా అమ్మవారికి ఘటాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. శ్రీనాథ్, శ్రీనివాస్,శిరీష కుటుంబసభ్యులు భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. పాడేరు ఘాట్‌లోని మోదకొండమ్మ పాదాలను భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. కుటుంబ సమేతంగా ఆలయ పరిసరాల్లో వంటలు చేసుకుని స్వీకరించారు.

దళారుల తప్పుడు ప్రచారాన్ని నమ్మొద్దు



జీసీసీ డివిజనల్ మేనేజర్ దేవరాజు

చింతపల్లి రూరల్: కాఫీ రైతులు దళారులు చెప్పిన మాటలు విని మోసపోవద్దని స్థానిక జీసీసీ డివిజనల్ మేనేజర్ పి.దేవరాజు అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ మార్కెట్లో కాఫీకి ధర తక్కువగా ఉందని దళారులు చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదన్నారు. ఇప్పటివరకు కాఫీ రైతుల నుంచి 40 టన్నులు మార్కెట్ ధరతో సంబంధం లేకుండా పాత ధరలకే కొనుగోలు చేశామన్నారు. కిలో పార్చిమెంట్ రూ.280, చెర్రీ రూ.145, రొబస్టా రూ.70 చొప్పున రైతులకు చెల్లిస్తున్నామన్నారు. కాఫీ గింజల్లో 10.5 మేర తేమ శాతం పక్కాగా ఉండాలని సూచించారు. కాఫీని విక్రయించిన రైతులకు ఒక్క రోజు వ్యవధిలో వారి ఖాతాల్లో నగదు జీసీసీ జమ చేస్తుందన్నారు. కాఫీ గింజలు సిద్ధం చేసుకుని సమాచారమిస్తే సిబ్బంది నేరుగా వచ్చి కొనుగోలు చేస్తారని ఆయన వివరించారు.

జగనన్నతోనే గ్రామ స్వరాజ్యం

- పురస్కారాలతో సత్కారం అభినందనీయం
- గ్రామ, వార్డు వలంటీర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కొమ్మా రాంబాబు



హాజరైన గ్రామ వలంటీర్లు

పాడేరు : గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యపడిందని గ్రామ, వార్డు వలంటీర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కొమ్మా రాంబాబు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొమ్ము సురేష్‌బాబు తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రమైన పాడేరులో నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇరువురు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులందరికీ ఇంటికి వద్దకు తీసుకువెళ్లి అందిస్తూ ప్రభుత్వ ఆశయం నెరవేరుస్తున్నామన్నారు. సేవా దృక్పథంతో పనిచేస్తున్న గ్రామ వలంటీర్లను ఏటా వజ్ర, సేవా మిత్ర, సేవా రత్న పురస్కారాలతో సత్కరించడం ఎప్పటికీ మరువలేమన్నారు. ఇకపై మరింత ఉత్సాహంగా పనిచేసి ప్రభుత్వం లక్ష్యసాధనలో ముందుంటామని వారు తెలిపారు.

ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు

సింధియా (విశాఖ): మల్కాపురంలోని కేంద్రీయ విద్యాలయం-1లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను ఒప్పంద ప్రాతిపదికన భర్తీ చేసేందుకు ఈనెల 29వ తేదీన ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సుధీర్‌కుమార్ మైంగి ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు తమ విద్యార్హత పత్రాలతో పాటు ఆన్‌లైన్‌లో పూర్తి చేసిన దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకొని ఇంటర్వ్యూలకు హాజరు కావాలని కోరారు. వివరాలకు https:no1nausenabagh.kvs.ac.inలో సందర్శించవచ్చన్నారు.

సహజ సిద్ధ అందాలు అద్భుతం

- విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ సంస్థ చైర్‌పర్సన్ ముంతాజ్ పట్టాన్
- కుటుంబ సమేతంగా సందర్శన



గిరి గ్రామదర్శినిలో గిరిజన వేషధారణలో కుటుంబసభ్యులతో చైర్‌పర్సన్ ముంతాజ్ పట్టాన్

అరకులోయ రూరల్: గిరిజన ప్రాంతంలో సహజసిద్ధమైన ప్రకృతి అందాలు అద్భుతంగా ఉన్నాయని, తమను ఇవి ఎంతగానో ఆకట్టుకున్నాయని విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ సంస్థ చైర్‌పర్సన్ ముంతాజ్ పట్టాన్ అన్నారు. ఆదివారం ఆమె కుటుంబ సభ్యులతో గిరిజన మ్యూజియం, పద్మాపురం గార్డెన్, గిరిగ్రామ దర్శినిని సందర్శించారు. వివిధ కళాకృతులను తిలకించారు. స్థానికులతో మాట్లాడారు. గిరిగ్రామ దర్శినిలో గిరిజన వేషధారణలో కుటుంబసభ్యులతో సందడి చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎటుచూసినా పచ్చని కొండలు, చల్లని వాతావరణం తమకు ఎంతగానే నచ్చిందన్నారు. జీవితంలో మరుపురాని అనుభూతిగా జ్ఞాపకం ఉండిపోతుందన్నారు. ఆదివాసీల కట్టుబాట్లు ఆసక్తికరమన్నారు. గిరిజన మ్యూజియం అసిస్టెంట్ మేనేజర్ శారద, సిబ్బంది వారి వెంట ఉన్నారు.

వాగుల్లో దిగి ప్రాణాలు పోగొట్టుకోవద్దు

- పర్యాటకులకు పోలీసుశాఖ సూచన
- అవగాహన కల్పించిన సీఐ వెంకటేశ్వరరావు



పర్యాటకులకు అవగాహన కల్పిస్తున్న రంపచోడవరం సీఐ వెంకటేశ్వరరావు

రంపచోడవరం: ఏజెన్సీ ప్రాంతానికి వచ్చే పర్యాటకులు తెలియని చోట కొండ వాగుల్లో దిగి ప్రాణాలు పోగొట్టుకొవద్దని రంపచోడవరం సీఐ వాసా వెంకటేశ్వరరావు సూచించారు. సీతపల్లి పార్క్ వద్ద ఆదివారం పర్యాటకులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీతపల్లి వాగులో దిగి ఇటీవల ఐదుగురు యువకులు ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. కొండకాలువల వద్ద ప్రమాదకర పరిస్థితులు ఉన్నందున జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అనాలోచితంగా కాలువల్లో దిగడమే కాకుండా వేగంగా వాహనాలు నడిపి విహార యాత్రలను విషాదం చేసుకోవద్దని హితవు పలికారు. ఏజెన్సీలో జరిగిన ప్రమాదాలను పర్యాటకులకు వివరించి అవగాహన కల్పించారు. ఏఎస్పీ జగదీష్ అడహళ్లి ఆదేశాల మేరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు ఆయన వివరించారు. ఏఎస్సై, సిబ్బంది పాల్గొన్నారు.

జంప్ జిలానీలకే పెద్దపీట!

- 'సుందరపు' ఫ్యామిలీకి పెరిగిన ప్రాధాన్యత
- గాజువాక సీటు తనకేనని చెప్పుకుంటున్న సతీష్
- అనకాపల్లి ఎంపీగా నాగబాబు పోటీ చేస్తారని లీకులు
- ఆయన కుమార్తె సినిమాకు సతీష్ పెట్టుబడి అంటూ ప్రచారం
- తమను దూరం పెట్టారంటూ పార్టీలో సీనియర్ల తీవ్ర అసహనం
- అసంతృప్తితో రగిలిపోతున్న జనసేన శ్రేణులు

సాక్షి, విశాఖపట్నం : ఇప్పటికే టీడీపీతో పొత్తుపై కత్తులు నూరుతున్న జనసేన శ్రేణులు ఇప్పుడు ఆ పార్టీలో అగ్ర నాయకుల వ్యవహార శైలిపై తీవ్ర అసహనంతో ఉన్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి కష్టపడి పనిచేస్తున్న తమను కాదని నిన్నగాక మొన్న చేరిన జంప్ జిలానీలకు పెద్దపీట వేస్తున్నారంటూ రగిలిపోతున్నారు. కేవలం డబ్బుకే ప్రాధాన్యమిస్తున్నారు తప్ప పార్టీలో సేవలకు గుర్తింపు లేదంటూ ఆవేదన చెందుతున్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో కొన్నాళ్ల క్రితం వరకు కొన్ని చోట్ల ఒకింత ఉత్సాహంగా కనిపించిన జనసేన నాయకులు, కార్యకర్తలు ప్రస్తుత పరిణామాలతో నిర్లిప్తత, నైరాశ్యంతో కనిపిస్తున్నారు. ముఖ్యంగా ఆ పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌తో పాటు ఆయన సోదరుడు నాగబాబుల వైఖరిపై గుర్రుగా ఉన్నారు. పవన్ సామాజికవర్గానికి చెందిన యలమంచిలి నియోజకవర్గానికి చెందిన సుందరపు విజయ కుమార్ గతం నుంచే జనసేనలో ఉన్నారు. అప్పటికే జనసేన సానుభూతిపరుడిగా ఉన్న ఆయన సోదరుడు, రియల్ ఎస్టేట్ వ్యాపారి, పోర్టు కాంట్రాక్టరు సతీష్ పార్టీలో చేరుతున్నారంటూ ఆకస్మికంగా (డిసెంబర్ 7న) పవన్ కల్యాణ్‌తో విశాఖలో బహిరంగ సభ ఏర్పాటు చేశారు. ఇది జనసేన నేతలను సైతం ఆశ్చర్యానికి గురి చేసింది. ఆ తర్వాత నుంచి అదే సామాజికవర్గానికి చెందిన 'సుందరపు' కుటుంబానికి పవన్, నాగబాబులు అధిక ప్రాధాన్యమిస్తున్నారంటూ పార్టీలో చర్చ మొదలైంది. సతీష్ తాను నాగబాబుకు అత్యంత సన్నిహితునిగా చెప్పుకోవడం, అందుకు తగ్గట్టే నాగబాబు వ్యవహార శైలి ఉండడం పార్టీలో ఇతర నాయకులకు మింగుడు పడడం లేదు. టీడీపీతో పొత్తులో భాగంగా గాజువాక సీటు తమకు ఖరారైందని, ఆ స్థానం నుంచి సతీష్ పోటీ చేయబోతున్నారంటూ కొద్ది రోజుల నుంచి విస్తృత ప్రచారం జరుగుతోంది. అదే సమయంలో అనకాపల్లి లోక్‌సభ స్థానం నుంచి నాగబాబు బరిలో ఉంటారన్న ప్రచారాన్ని ముమ్మరం చేశారు.

నాగబాబు కుమార్తె సినిమాకు సతీష్ పెట్టుబడి

నాగబాబు కుమార్తె తీస్తున్న ఓ సినిమాకు సతీష్ భారీగా పెట్టుబడి పెట్టారని, అందుకే సతీష్ సోదరులిద్దరికీ పార్టీలో ప్రాధాన్యతనిస్తున్నారని, సతీష్‌కు గాజువాక సీటు దక్కేలా చూస్తున్నారని జనసేన నాయకులు బహిరంగంగానే చెప్పుకుంటున్నారు. పోర్టు కాంట్రాక్టరు కూడా అయిన సతీష్ గాజువాక సీటు నుంచి గెలిస్తే గంగవరం పోర్టుపై పట్టు సాధించవచ్చన్నది వారి వ్యూహంగా ఉందని పార్టీలో కొందరు చర్చించుకుంటున్నారు. ఒకవేళ అదే జరిగితే గాజువాక సీటుపై కోటి ఆశలు పెట్టుకున్న టీడీపీ నాయకుడు పల్లా శ్రీనివాసరావు పరిస్థితి ఏమిటన్నది చర్చనీయాంశంగా మారింది.

జీర్ణించుకోలేకపోతున్న సీనియర్లు..

మరోవైపు పార్టీ ఆవిర్భావం నుంచి కష్టపడి పనిచేస్తున్న వారిని పక్కనబెట్టి పార్టీలు మారి వచ్చిన వారికి ప్రాధాన్యతనిస్తున్నారంటూ జనసేన సీనియర్లు రగిలిపోతున్నారు. ఇప్పటికే సుందరపు కుటుంబానికిస్తున్న ప్రాధాన్యతపై గుర్రుగా ఉన్న ఆ పార్టీ నాయకులు తాజా పరిణామాలతో మరింతగా అసంతృప్తితో ఉన్నారు. ఇటీవల వైఎస్సార్‌సీపీ నుంచి మాజీ ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు, ఎమ్మెల్సీ వంశీకృష్ణ యాదవ్, మాజీ మంత్రి కొణతాల రామకృష్ణలు జనసేనలో చేరారు. వీరిలో పంచకర్లకు పెందుర్తి సీటు ఖాయమన్న ప్రచారం చేసుకుంటున్నారు. దీంతో ఇన్నాళ్లూ ఆ సీటును ఆశిస్తున్న జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.శివశంకర్‌కు మింగుడు పడడం లేదు. అలాగే మరో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొలిశెట్టి సత్య కూడా విశాఖలో సీటు ఆశిస్తున్నారు. టీడీపీతో పొత్తులో ఆయనకు సీటు దక్కే అవకాశాలు లేకపోవడంతో కొన్నాళ్లుగా పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉంటున్నారు. ఇటీవలే జనసేనలో చేరిన కొణతాల రామకృష్ణ అనకాపల్లి అసెంబ్లీ నుంచి పోటీ చేస్తారన్న ప్రచారం అక్కడ చాలా ఏళ్లుగా ఇన్‌చార్జిగా ఉన్న పరచూరి భాస్కరరావుకు కంటిమీద కునుకులేకుండా చేస్తోంది. టీడీపీతో పొత్తు వల్ల తమకు పోటీ చేసే అవకాశమే లేకుండా పోతోందన్న ఆవేదన ఒకవైపు, తాము కష్టపడి పార్టీ కోసం పనిచేస్తే ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి పెద్ద పీట వేస్తున్నారన్న బాధ మరో వైపు జనసేన నాయకులను వేధిస్తోంది.

క్యాడరును పట్టించుకోని పవన్

అధినేత పవన్ విశాఖ వచ్చినప్పుడు తమను ఏమాత్రం పట్టించుకోవడం లేదంటూ జనసేన క్యాడరు అసంతృప్తితో ఉంది. ఎవరో ఒకరిద్దరికే కలిసే అవకాశం ఇవ్వడం, హోటల్ గదికే పరిమితమవ్వడం తప్ప మిగతా వారిని దరికి చేరనీయడం లేదని మధన పడుతున్నారు. ప్రజారాజ్యంలోనూ నాగబాబు ఇదే తీరును ప్రదర్శించారని, ఇప్పుడూ అదే జరుగుతోందని వీరు గుర్తు చేస్తున్నారు.

శారదాపీఠంలో ఆధ్యాత్మిక సందడి

నేడు పూర్ణాహుతితో ముగియనున్న వేడుకలు



రథోత్సవాన్ని ప్రారంభిస్తున్న స్వామీజీలు



యాగశాలలో పర్యవేక్షిస్తున్న స్వామీజీలు

పెందుర్తి: శారదా పీఠం ప్రాంగణం.. వేదఘోషతో ప్రతిధ్వనించింది. సర్వప్రాణి శ్రేయస్సు కోసం తలపెట్టిన రాజశ్యామల, వనదుర్గ హోమాలతో ఆధ్యాత్మికత గుబాళించింది. నాలుగో రోజు ఆదివారం యజ్ఞయాగాదులు దిగ్విజయంగా జరిగాయి. సుబ్రహ్మణ్యస్వామి ఆరాధనతో పీఠం సందడిగా మారింది. పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి మహాస్వామీజీ, ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామీజీ సుబ్రహ్మణ్యస్వామికి ప్రత్యేక పూజలు జరిపారు. పీఠం అనుష్ఠాన దేవత శారదా స్వరూప రాజశ్యామల అమ్మవారికి, దాసాంజనేయ స్వామి, మేధాదక్షిణామూర్తికి ప్రత్యేక పూజలు చేశారు. గోమాతకు పూజ చేసి నైవేద్యం అందించారు. జమ్మి చెట్టు ప్రదక్షిణ చేశారు. సాయంత్రం సుబ్రహ్మణ్యస్వామి రథోత్సవం కనులపండువగా సాగింది. సుబ్రహ్మణ్యస్వామి, వల్లీ కల్యాణం శాస్త్రోక్తంగా జరిపారు. కళాకారుల ప్రదర్శన ఆకట్టుకుంది. నాలుగు రోజులుగా అత్యంత వైభవంగా సాగిన వార్షికోత్సవాలు సోమవారంతో ముగియనున్నాయి. లోక కల్యాణార్థం తలపెట్టిన రాజశ్యామల యాగం పూర్ణాహుతితో వేడుకలకు స్వామీజీలు ముగింపు పలుకుతారు. ఉత్సవాల ముగింపునకు రాష్ట్రం నలుమూలల నుంచి ప్రముఖులు హాజరు కానున్నారు.

దట్టంగా పొగమంచు

- తగ్గుముఖం పట్టని చలిగాలులు



పాడేరు-చింతలవీధి మార్గంలో దట్టంగా కురుస్తున్న పొగమంచు

సాక్షి, పాడేరు: జిల్లా వ్యాప్తంగా చలిగాలులు విజృంభిస్తున్నాయి. ఆదివారం కాస్త ఉష్ణోగ్రతలు పెరిగినప్పటికి పొగమంచు దట్టంగా కురిసింది. ఉదయం 8గంటల వరకు మంచు తెరలు వీడలేదు. పాడేరు మండలం మినుములూరు కేంద్ర కాఫీబోర్డు వద్ద 13డిగ్రీలు, చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానం వద్ద 14 డిగ్రీలు, అరకులోయ కేంద్ర కాఫీ బోర్డు వద్ద 15.1డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మధ్యాహ్నం కూడా మబ్బు వాతావరణంతో చల్లదనం నెలకొంది. సాయంత్రం నాలుగు గంటల నుంచి చలిగాలులు తీవ్రంగా ఉండడంతో ప్రజలంతా ఇళ్లకు పరిమితమయ్యారు. చలినుంచి ఉపశమనం పొందేందుకు మంటలను ఆశ్రయించారు.

ఆశ్రమ విద్యార్థులకు మెరుగైన వైద్యం

- పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ ఆదేశం
- జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులకు పరామర్శ



చికిత్స పొందుతున్న విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్న ఐటీడీఏ పీవో అభిషేక్

పాడేరు : ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు అనారోగ్యానికి గురైతే వెంటనే ఆస్పత్రులకు తరలించి మెరుగైన వైద్యం అందించాలని పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ ఆదేశించారు. అనారోగ్యానికి గురై పాడేరు జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అనంతగిరి, ముంచంగిపుట్టు, పాడేరు మండలాల ఆశ్రమ పాఠశాల విద్యార్థినులను ఆదివారం ఆయన పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. విద్యార్థుల కోసం జిల్లా ఆస్పత్రిలో ప్రత్యేక వార్డు కేటాయించి వైద్యం అందించాలని ఆస్పత్రి సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. నిరుపయోగంగా ఉన్న వైద్య పరికరాలను వినియోగంలోకి తేవాలని సూచించారు. జిల్లా ఆస్పత్రిలో సిబ్బంది కొరతపై ఐటీడీఏ ద్వారా వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్‌కు లేఖ రాస్తామన్నారు. ఆస్పత్రిలో వైద్యం పొందుతున్న ముగ్గురు విద్యార్థినుల్లో పరిస్థితి విషమంగా ఉన్న ఒకరిని విశాఖపట్నం తరలించినట్టు సూపరింటెండెంట్ తెలిపారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఆశ్రమ పాఠశాలలో విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తామని పీవో పేర్కొన్నారు. ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల మరణాలు సంభవిస్తే విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట గిరిజన సంక్షేమ శాఖ డీడీ కొండలరావు, ఏటీడబ్ల్యూవో రజని ఉన్నారు.

ఔరా..!


పారాచూట్ ద్వారా డైవ్ చేస్తున్న కమాండోలు



అబ్బురపరిచిన నేవీ రిహార్సల్స్
కిటకిటలాడిన ఆర్.కె.బీచ్

విశాఖ మరో అంతర్జాతీయ వేడుకకు సిద్ధమైంది. భారత నౌకాదళం సారథ్యంలో సోమవారం నుంచి ఈ నెల 27 వరకు జరగనున్న మిలాన్–24కు తూర్పు నావికాదళం అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మిలాన్‌లో భాగంగా 22న జరగబోయే హార్బర్ ఫేజ్ విన్యాసాలకు సంబంధించి ఆదివారం ఆర్.కె.బీచ్‌లో నిర్వహించిన రిహార్సల్స్ అద్భుతంగా సాగాయి. యుద్ధ సమయంలో నావికాదళం ఎలా స్పందిస్తుంది? శత్రువులపై ఎలా ఎదురుదాడికి దిగుతుందో విన్యాసాల రూపంలో కళ్లకు కట్టినట్లు చూపించారు. తమ సత్తాను చాటుతూ.. నింగి, నేల, నీటిపై.. మన కమాండోలు చేసిన ప్రదర్శనలు ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి. గగనంలో యుద్ధ విమానాలు చక్కర్లు కొడుతూ బాంబులు వేయడం వంటి విన్యాసాలను ప్రజలు ఆసక్తిగా తిలకించారు. నేవీ విద్యార్థులు జాతీయ, నేవీ గీతాలకు చేసిన నృత్య ప్రదర్శన, నేవీ సిబ్బంది బ్యాండ్ ప్రదర్శన, దేశ రక్షణ బలగాలతో కూడిన కవాతును చూసేందుకు పెద్ద ఎత్తున నగర ప్రజలు ఆర్.కె.బీచ్‌కు తరలివచ్చారు. సాయంత్రం సమయంలో సముద్రంలో యుద్ధ నౌకలు విద్యుత్ వెలుగులతో కనువిందు చేశాయి. సందర్శకులకు ఇబ్బందులు లేకుండా ప్రత్యేక గ్యాలరీలు సిద్ధం చేశారు.

– బీచ్‌రోడ్డు






మిలాన్ రిహార్సల్స్ కార్యక్రమంలో నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు




ఆర్.కె.బీచ్‌లో జరిగిన మిలాన్ రిహార్సల్స్ కార్యక్రమంలో కవాతు చేస్తున్న రక్షణ బలగాలు

సీతారాములకు ఘనంగా పుష్పయాగం

1500 కిలోల వివిధ రకాలైన పూలను వినియోగించిన భక్తులు


పుష్పయాగం నిర్వహిస్తున్న వేదపండితులు

కె.కోటపాడు : ఆర్.వై.అగ్రహారం గ్రామంలో శ్రీ సీతారాములకు 1500 కిలోల వివిధ రకాలైన పుష్పాలతో పుష్పయాగం కనుల పండువలా జరిపారు. గ్రామానికి చెందిన గోవిందు రమణమూర్తి, నేమాని వేంకటేశ్వరశర్మలతో పాటు వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఆదివారం పుష్పయాగం నిర్వహించారు. పెందుర్తి వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రధాన అర్చకులు మహర్షి రామానుజం ఆధ్వర్యంలో వేదపండితులు ఈ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా చేశారు. సీతారాముల ఉత్సవ విగ్రహాలను సుందరంగా అలంకరించి వేద పండితులు పుష్పయాగం ఘనంగా జరిపారు. కడియం నుంచి 1500 కిలోల బంతి, చామంతి, మల్లె, గులాబీలతో పాటు పలు రకాలైన పుష్పాలను తీసుకువచ్చి వినియోగించారు. కార్యక్రమంలో పాల్గొనడానికి ఆర్.వై.అగ్రహారంతో పాటు సమీప గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. సీతారాముల కల్యాణంతో ప్రారంభమైన కార్యక్రమం పుష్పయాగం, మహా మంగళ హారతితో ముగిసింది. అయోధ్యలో రాముని విగ్రహ ప్రతిష్ఠ అనంతరం రాష్ట్రంలో మొదటిసారిగా ఆర్.వై.అగ్రహారం గ్రామంలోనే సీతారాములకు పుష్పయాగం నిర్వహించినట్టు గోవిందు రమణమూర్తి, నేమాని వేంకటేశ్వరశర్మ తెలిపారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన జరిపారు. రమణమూర్తి, మండ మల్లికార్జున్‌తో పాటు గ్రామస్తులు సహకారం అందించారు.

సరుగుడు జలపాతం వద్ద సండే సందడి


జలపాతం వద్ద పర్యాటకులు

నాతవరం: సరుగుడు జలపాతం వద్ద ఆదివారం సందర్శకులతో కోలాహలం నెలకొంది. ఇక్కడ ఎత్తయిన రెండు కొండల మధ్యలోంచి ప్రవేశించే నీటిలో జలకాటాలాడేందుకు ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన సందర్శకులు పోటీపడ్డారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందంగా గడిపారు. ఉమ్మడి విశాఖ, తూర్పుగోదావరి జిల్లాల నుంచి పెద్ద ఎత్తున వాహనాల్లో రావడంతో ఈ ప్రాంతమంతా సందడి వాతావరణం నెలకొంది. అదేవిధంగా తాండవ రిజర్వాయరుపైనా సందర్శకుల తాకిడి కనిపించింది. కొంతకాలంగా ఈ రెండు ప్రదేశాలను తిలకించేందుకు దూర ప్రాంతాల నుంచి అధికంగా సందర్శకులు రావడంతో కొత్తగా చిరు వ్యాపారులు షాపులు ఏర్పాటు చేస్తున్నారు.

రూ.20 లక్షలతో చెరువు సుందరీకరణ

ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర


చెరువు సుందరీకరణ పనులను ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో రూ.20 లక్షలతో చేపడుతున్న చెరువు సుందరీకరణ పనులను వెంటనే ప్రారంభించి యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర ఆదేశించారు. స్థానిక అంబేద్కర్ పార్కు సమీపంలో చేపట్టిన చెరువు సుందరీకరణ పనులను ఆదివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో ఎంతో ఆహ్లాదకరంగా ఉండే చెరువు పరిసరాలు నేడు అధ్వానంగా మారాయన్నారు. పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు రూ.20 లక్షలు వెచ్చిస్తున్నట్టు ఆమె పేర్కొన్నారు. తొలివిడతగా రూ.10 లక్షలతో పనులు చేపడుతున్నట్టు ఆమె వివరించారు. చెరువును ఆనుకుని వాకింగ్ ట్రాక్, గార్డెన్ అభివృద్ధితో పాటు మన్యవీరుడు అల్లూరి విగ్రహం ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సత్యనారాయణ, సర్పంచులు సుభాష్‌చంద్ర, రమేష్, బాబూరావు, రత్న, ఎంపీటీసీ సుబ్బలక్ష్మి, మండల వైఎస్సార్‌సీపీ నేతలు కొండలరావు, మూర్తి, అర్జున్, పద్మారావు, పులిరాజు, మోహన్, ఏపీఎం దేవమంగ, పీఆర్ ఏఈ మురళీకృష్ణ పాల్గొన్నారు.

అదుపుతప్పి ఒరిగిన ట్రాలీ

- లంబసింగి ఘాట్‌రోడ్డులో నిలిచిన ట్రాఫిక్
- ఎనిమిది గంటలపాటు ప్రయాణికుల అవస్థలు


నిలిచిపోయిన వాహనాలు


లంబసింగి ఘాట్‌లో అదుపు తప్పి ఒరిగిన ట్రాలీ

చింతపల్లిరూరల్: ట్రాలీ అదుపుతప్పి పక్కకు ఒరిగిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. లంబసింగి ఘాట్‌రోడ్డులో ఆదివారం సాంకేతిక లోపం కారణంగా ట్రాలీ రోడ్డు మధ్యలో ఆగిపోయింది. దీంతో చింతపల్లి నుంచి నర్సీపట్నం రాకపోకలు సాగించే ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ వాహనాలు సుమారు ఎనిమిది గంటలపాటు నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

అమ్మకు పనిభారం.. బిడ్డకు అమ్మమ్మ మమకారం



గిరిజన ప్రాంతాల్లో మహిళలు వ్యవసాయ పనుల్లో నిత్యం నిమగ్నమై ఉంటారు. ప్రస్తుతం పసుపు తవ్వకాల సీజన్ కావడంతో ఎక్కడ చూసినా పనులు జోరందుకున్నాయి. ఇందులో భాగంగానే ఓ తల్లి తన బిడ్డను గొడుగు నీడన పడుకోబెట్టి పసుపు తవ్వుతుండగా, చిన్నారిని అమ్మమ్మ సాకుతూ కనిపించింది. మమకారానికి ప్రతీకగా నిలిచిన ఈ దృశ్యాన్ని చింతపల్లి మండలం చౌడుపల్లి గ్రామ పొలాల్లో 'సాక్షి' కెమెరా క్లిక్‌మనిపించింది.

– సాక్షి, పాడేరు

ఏయూలో వెబ్ సిరీస్ షూటింగ్



మద్దిలపాలెం: నటుడు ఆది పినిశెట్టి హీరోగా తెరకెక్కుతున్న ఓ వెబ్‌సిరీస్ షూటింగ్ ఆదివారం ఆంధ్ర విశ్వ విద్యాలయం ఇంజినీర్ కళాశాలలో జరిగింది. ఇక్కడ కాలేజీ ఎన్నికలు, ప్రచారం తదితర సన్నివేశాలను చిత్రీకరించారు. ఈ విషయం తెలుసుకున్న సినీప్రియులు షూటింగ్ తిలకించేందుకు తరలివచ్చారు. ఏయూలో మరికొన్ని సన్నివేశాలు చిత్రీకరించనున్నట్లు తెలిసింది.

నేటి నుంచి 'అమృతోత్సవం'

సీతంపేట (విశాఖ): శ్రీ లలితాపీఠం 75వ వార్షికోత్సవం సందర్భంగా 'అమృతోత్సవం'పేరిట ఈ నెల 19 నుంచి 24 వరకు పాంచరాత్ర దీక్షతో విశేష పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. అక్కయ్యపాలెం శ్రీ లలితాపీఠంలో ఇందుకు సంబంధించిన కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 19వ తేదీ సోమవారం ఉదయం 5 గంటల నుంచి మహా సంకల్పం, గణపతి పూజ, పుణ్యాహవచనం, రక్షాబంధన, అంకురార్పణ, రుత్విగ్వరణం, అగ్నిమధనం, అఖండ దీపస్థాపన, సాయంత్రం 7 గంటలకు లలితావైభవం కవి సమ్మేళనం, పీఠాధిపతిచే అనుగ్రహ భాషణం జరుగుతుందన్నారు. 20వ తేదీ ఉదయం 9 గంటలకు యాగశాలలో మండపారాధన, కలశస్థాపన, సాయంత్రం లలితాసహస్ర నామ పారాయణ, శక్తిపీఠాధీశ్వరి రమ్యానంద భారతి స్వామి అనుగ్రహ భాషణం చేస్తారన్నారు. 21వ తేదీ సాయంత్రం 6.30 గంటలకు శ్రీభూనీలా సమేత కల్యాణ వెంకటేశ్వరుని కల్యాణం, 22వ తేదీ సాయంత్రం 6.30 గంటలకు లలితాకామేశ్వరుల కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరుగుతుందని వెల్లడించారు. 23 తేదీ సాయంత్రం జగద్గురువులచే అమృత భాషణం, 24వ తేదీ ఉదయం విశేష హోమాలు, సాయంత్రం 6 గంటలకు లలితా అమ్మవారి నగరోత్సవం జరుగుతుందన్నారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం తథ్యం

- ఓటమి భయంతోనే విపక్షాల తప్పుడు ప్రచారం
- నల్లగొండలో పర్యటించిన పాడేరు అసెంబ్లీ సమన్వయకర్త విశ్వేశ్వరరాజు


నల్లగొండలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న విశ్వేశ్వరరాజు, నేతలు

కొయ్యూరు: ప్రజల వద్దకే పాలనను తీసుకువచ్చిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని అందరూ ఆశీర్వదించి, మరలా ముఖ్యమంత్రిగా గెలిపించాలని వైఎస్సార్‌సీపీ పాడేరు అసెంబ్లీ సమన్వయకర్త ఎం.విశ్వేశ్వరరాజు కోరారు. ఇచ్చిన హామీలను అమలు చేసిన ఏకైక ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి రికార్డు సాధించారన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం తథ్యమన్నారు. చింతపల్లి మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జె.రాజులమ్మ ఆహ్వానం మేరకు ఆయన ఆదివారం నల్లగొండలో పర్యటించారు. ముందుగా గ్రామంలోని దివంగత ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామంలో ప్రతీ ఇంటికి వెళ్లి ప్రజలతో మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుతీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై వస్తున్న ప్రజాదరణను చూసి ప్రతిపక్షాలు ఏమి చేయాలో తోచక తప్పుడు ప్రచారాలు చేస్తున్నాయన్నారు. ఎల్లో మీడియా తప్పుడు రాతలు రాస్తోందన్నారు. విపక్షాల ఎన్ని కుట్ర రాజకీయాలు, కుయుక్తులు చేసినా నమ్మే స్థితిలో ప్రజలు లేరని చెప్పారు. జగనన్న ప్రభుత్వం అన్ని వర్గాలకు పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందించిందన్నారు. చంద్రబాబు ఇస్తున్న మోసపూరిత హామీలను ప్రజలు నమ్మరని, రానున్న ఎన్నికల్లో టీడీపీకి బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు వారా నూకరాజు, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రేగటి ముసిలినాయుడు వైస్ ఎంపీపీలు అప్పన వెంకటరమణ, అంబటి నూకాలమ్మ, ఎంపీటీసీ సభ్యులు బి.అప్పారావు, ఎస్.మల్లేశ్వరి, పీఏసీఎస్ చైర్మన్ సువర్ణ సూరిబాబు, సర్పంచ్‌లు జంపా రాజకుమారి, చంద్రరావు, రావుల వెంకటలక్ష్మి, మండల బూత్ కమిటీ కన్వీనర్ పాట్టిక పోతురాజు, ఏఎంసీ డైరెక్టర్ అచ్యుత్, మాజీ సర్పంచ్ పల్లి చిన్నభాయ్, నాయకులు శ్రీను, సింహాచలం, రామ్మూర్తి, శేఖర్, గంగరాజు, సచివాలయ కన్వీనర్ రామరావు తదితరులు పాల్గొన్నారు.